నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 21 డిసెంబర్ 2023 | KAMAREDDY



# ఇందూరు బిడ్డకు అర్జున అవార్డు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 20: అంతర్జాతీయ బాక్సర్ హుసాముద్దీన్ అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ జాతీయ క్రీడా అవార్డులను బుధవారం ప్రకటించింది. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి నుంచి జిల్లాకు చెందిన బాక్సర్ హుసాముద్దీన్ అర్జున అవార్డును అందుకోనున్నారు. హుసాముద్దీన్‌కు అర్జున అవార్డు రావడంపై జిల్లావాసులు, క్రీడాకారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కవిత అభినందన..

ఖలీల్‌వాడీ, డిసెంబర్ 20 : షూటింగ్, బాక్సింగ్ విభాగంలో అర్జున అవార్డుకు ఎంపికైన తెలంగాణకు చెందిన ఈషాసింగ్, మహ్మద్ హుసాముద్దీన్‌లకు ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. మీ ప్రతిభ, కృషి, ప్రపంచ వేదికపై దేశానికి కీర్తిని తెచ్చిపెట్టాయని అభినందించారు.

# ట్రాన్స్‌లొకేషన్.. చెట్లకు పునర్జీవం

సంగారెడ్డి–నాందేడ్–అకోలా జాతీయ రహదారి విస్తరణ పనులు మూడేండ్ల కిందట ప్రారంభించారు. పనులు చేసే క్రమంలో పిట్లం రేంజ్ పరిధిలో భారీ చెట్లను తొలగించాల్సి వచ్చింది. దీంతో అటవీ శాఖ అధికారులు తొలగించిన చెట్లను (ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో) భారీ క్రేన్ల సహాయంతో ఇతర చోట్ల నాటారు. ట్రాన్స్ లొకేషన్ అంటే చెట్లకు ఉన్న కొమ్మలను తొలగించి వేర్లతో సహా వెలికితీసి మరోచోట నాటడం. మూడేండ్ల క్రితం ఈ పద్ధతిలో నాటడంతో అవి భారీ వృక్షాలుగా మారాయి.

**పలు రకాల చెట్లను నాటారు**

2019 సంవత్సరంలో భారీ వృక్షాలను రహదారి విస్తరణలో తీసేయాల్సి వచ్చింది. దీంతో రహదారి విస్తరణ చేసే సంస్థ అటవీ శాఖ అధికారులతో కలిసి మరో చోట నాటారు. నిజాంసాగర్ మండల పరిధిలో 92 చెట్లను తొలగించారు. ఆ సమయంలో రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్, బీట్ అధికారి సిద్ధార్థ పర్యవేక్షణలో 46 చెట్లను మంగ్లూర్ అటవీ ప్రాంతంలో, 46 చెట్లను ఒడ్డెపల్లి శివారులో ట్రాన్స్ లొకేషన్ పద్ధతిలో నాటారు. జుక్కల్ మండల శివారులో సైతం 15 చెట్లను తొలగించగా వాటిని శేఖాపూర్ శివారులో నాటారు. వాటిలో మర్రి, రావి, వేప, నెమలినార, నర్సింగ్, సోమ, ఇప్ప, మొర్రితో పాటు పలు రకాల చెట్లు ఉన్నాయి.

**సంతోషంగా ఉంది**



రహదారి విస్తరణ సమయంలో రహదారి పనులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించిన సమయంలో వాటిని ట్రాన్స్ లొకేషన్ ద్వారా మరో చోట నాటడంతో వాటిలో చాలా వరకు చెట్లు బతికి ప్రస్తుతం చక్కగా ఏపుగా పెరిగాయి. నాటిన చెట్లలో మర్రి, మేడి, రావి, జువ్వి వంటి చెట్లు వంద శాతం బతికాయి. వేప ఒక్కటి మాత్రమే అంతగా బతకలేకపోయాయి. నాటిన చెట్లను చక్కగా సంరక్షించడంతోనే విజయం సాధ్యమైంది.

– సంజయ్‌గౌడ్, రేంజ్ అధికారి

రహదారి విస్తరణ పనులకు అడ్డువచ్చిన చెట్లకు ఫారెస్టు అధికారులు జీవం పోశారు. సంగారెడ్డి–నాందేడ్–అకోలా జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మూడేండ్ల క్రితం తొలగించిన భారీ వృక్షాలను ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో ఇతర ప్రాంతాల్లో నాటి వాటిని సంరక్షించారు. దీంతో ఆ వృక్షాలు మళ్లీ ఏపుగా పెరిగాయి. నిజాంసాగర్, జుక్కల్ మండలాల్లో మొత్తం 107 చెట్లను ఈ పద్ధతిలో తిరిగి నాటగా 70 వరకు చెట్లు బతికి ఏపుగా పెరిగాయి. అటవీశాఖ అధికారులు తీసుకున్న చొరవకు ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు.

–నిజాంసాగర్, డిసెంబర్ 20



క్రేన్ సహాయంతో చెట్లను తొలగించి మరో చోటుకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



ప్రస్తుతం ఏపుగా పెరిగిన చెట్టు

రహదారి పనుల్లో తొలగించిన చెట్లు
మరోచోట నాటడడంతో పునర్జీవం
అధికారుల శ్రమకు దక్కిన ఫలితం
ఏపుగా పెరిగిన చెట్లు

**చెట్లకు జీవం..**

నిజాంసాగర్, జుక్కల్ మండలంలో మొత్తం 107 చెట్లను ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో నాటగా వాటిలో సుమారు 70 వరకు చెట్లు బతికి ఏపుగా పెరిగాయి. అటవీశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయంతో మంచి విజయాన్ని సాధించారంటూఉన్నతాధికారులు సైతం సిబ్బందిని అభినందిస్తున్నారు. నాటిన చెట్లను చక్కగా సరంక్షించడంతోనే ఈ రోజు ఏపుగా పెరిగాయి

# కార్యకర్తలు ధైర్యంగా ఉండండి

నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 20 : ఎన్నికల్లో ఓడిపోయామని ఆందోళన చెందవద్దని.. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్‌లోని తన నివాస ప్రాంగణంలో రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 100 రోజుల్లో గ్యారెంటీ హామీలు ప్రజలకు అందించాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. లేనియెడల హామీల అమలు కోసం ప్రజలతో కలిసి ఉద్యమం చేపట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వేలాది కోట్ల నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసిన ఫలితంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించాల్సిందేనన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాల్సిన గురుతర బాధ్యతను గుర్తించాలన్నారు. సమావేశంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి , హాజరైన నాయకులు

## సెన్సార్‌బోర్డులో చోటు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 20: నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డులో అవకాశం దక్కింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శిల శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యాలయ జాయింట్ కార్యదర్శి కందుల జశ్వంత్, కార్యదర్శి ఆదిష్ కోర్వలను సెన్సార్‌బోర్డు సభ్యులుగా నియమించారు.

## 23న అలీసాగర్ నీటి విడుదల

నవీపేట, డిసెంబర్ 23: కోస్లీ వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం నుంచి ఈనెల 23న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అలీసాగర్ నీటిని విడుదల చేస్తారని అలీసాగర్ ప్రాజెక్టు ఏఈ ప్రణయ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి పంటలకు ఆరు మండలాల్లో 46 వేల ఎకరాలకు ఆరు విడుతల్లో నీటిని అందిస్తామని పేర్కొన్నారు.

**కాకతీయ కాలువకు..**

మెండోరా, డిసెంబర్ 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు యాసంగి పంటల కోసం 3,500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నదని ఏఈఈ రవి తెలిపారు. సరస్వతీ కాలువకు 50, గుత్ప ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. మిషన్ భగీరథ కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1088.30 అడుగులు (77.383 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదని తెలిపారు.

## లక్ష్మి కాలువకు నీటి విడుదల

ముప్కాల్, డిసెంబర్ 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువల్లో ఒకటైన లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదలను బుధవారం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు సంయుక్తంగా ఉదయం 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మావెంకట్ రెడ్డి, జడ్పీటీసీ బద్దం నర్సవ్వానర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్ష్మి కాలువ ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. వారబందీ ప్రకారం నీటి విడుదల కొనసాగుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పద్మ, వేంపల్లి ఉప సర్పంచ్ జక్కు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మి కాలువ గేట్ల స్విచ్ ఆన్ చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

## అసెంబ్లీలో తొలిసారి..



ఎల్లారెడ్డి, డిసెంబర్ 20 : ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో బుధవారం మొదటిసారి తన గళం వినిపించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయన మాట్లాడారు.

## సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 20: బంజారాల అభ్యున్నతికి కృషిచేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవుదినంగా, బంజారా దినోత్సవంగా ప్రకటించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ విషయాన్ని లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సేవాలాల్ మహరాజ్‌ని స్మరిసూ–2023 ఏడాదిపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఎంపీ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో తెలంగాణకు గిరిజన విశ్వవిద్యాలయం, పసుపు బోర్డును మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోదీకి ఎంపీ అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి..

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
కామారెడ్డి బస్టాండ్ పరిశీలన

కామారెడ్డి,డిసెంబర్ 20 : ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. కామారెడ్డి బస్టాండ్‌ను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకానికి మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నదన్నారు. గతంలో రోజూ లక్షా 20 వేల మంది వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుండేవారని.. ఈ నెల 9 నుంచి ప్రారంభమైన మహాలక్ష్మి పథకంతో ఆ సంఖ్య సుమారు రెండు లక్షల వరకు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ 63 శాతం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినులకు ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగపడుతున్నదని అన్నారు. వరుస సెలవులు వస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మహిళల భద్రతకు తగు ఏర్పాట్లు చేయాలని, రద్దీకి అనుగుణంగా అవసరమైతే పోలీసు రక్షణ కల్పిస్తామన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 19 వరకు కామారెడ్డి డిపో నుంచి 6,82,887 మంది ప్రయాణికులు ప్రయాణించగా అందులో మహిళలే 4,29,812 మంది ఉన్నారన్నారు. మొదటి రోజు 30 శాతం, రెండో రోజు 57 శాతం వినియోగించుకోగా తర్వాత ప్రతి రోజూ 65 నుంచి 68 శాతం మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు.



ఆర్టీసి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్

# పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

నిజామాబాద్ స్పోర్ట్స్/కామారెడ్డి, డిసెంబర్ 20 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో, సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నిర్వహణపరమైన ఏర్పాట్లపై దృష్టిని కేంద్రీకరించాలని, ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన అంశాలతో కూడిన వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా పక్కాగా ఉండాలని, మార్పులు, చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో పెట్టకూడదని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని తక్షణమే గుర్తిస్తూ, పోలింగ్ కేంద్రాల పునః వ్యవస్థీకరణ చేయాలని సీఈవో సూచించారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పుల విషయమై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై సమీక్షించాలని, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ రూపొందించిన తుది జాబితాను తమకు పంపించాలన్నారు.

2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలను ఖరారు చేయాలని, భద్రతాపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంతసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, నివేదికలు సమర్పించాలన్నారు. నిజామాబాద్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి జితేశ్ వీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు

# గురుకులానికి వేళాయె..

ఐదో తరగతిలోప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
జనవరి 6వ తేదీ వరకు గడువు,
ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష
గత కేసీఆర్ ప్రభుత్వం కృషితో కార్పొరేట్ స్థాయిలో గురుకులాలు
ఉమ్మడి జిల్లాలో 3వేలకుపైగా విద్యార్థుల చేరే అవకాశం

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20: బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

**అర్హతలు..**

2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు ఈ సంవత్సరం 4వ తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ పత్రం(బోనాఫైడ్)ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

- 1.09.2011 నుంచి 31.8.2015 లోపల జన్మించి ఉండాలి. (9 నుంచి 13 సంవత్సరాల్లోపు విద్యార్థులకు మాత్రమే)
- వార్షిక ఆదాయం రూరల్ వారికి రూ.1,50,000, అర్బన్ వారికి రూ.2,00,000 ఉండాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తు ఇలా..వెబ్‌సైట్లు..**

http://tswreis.ac.in
http://tgtwgurukulam.telangana.gov.in
http://tgcet.cgg.gov.in
http://mjptbcwreis.telangana.gov.in

**ప్రవేశ పరీక్ష ఇలా..**

- ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు.
- తెలుగు, ఇంగ్లిష్, గణితం, మెంటల్ ఎబిలిటీ (మానసిక సామర్థ్యం), పరిసరాల విజ్ఞానంలో 3,4 తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.
- మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది.
- తెలుగు –20, ఇంగ్లిష్– 25, పరిసరాల విజ్ఞానం –20, మెంటల్ ఎబిలిటీ –10 మార్కులు ఉంటాయి.
- ఓఎంఆర్ షీట్‌లో జవాబులు గుర్తించాలి.
- పరీక్షా పత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది.

**కావాల్సినవి...**

- పాస్ పోర్టు సైజ్ ఫొటో, విద్యార్థి సంతకం
- విద్యార్థి బోనాఫైడ్
- వివరాలను అప్‌లోడ్ చేసే ముందుగానే జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది.
- ఈ నెల 18 నుంచి జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.
- ఉమ్మడి జిల్లాలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.
- ప్రవేశపరీక్షలో వచ్చిన ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

**గురుకుల ప్రవేశాల కోసం భారీ డిమాండ్**

ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన ఆంగ్ల విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించేలా మెనూ అమలు చేస్తూ గురుకుల విద్యను బలోపేతం చేసింది. దీంతో గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి భారీ పోటీ నెలకొన్నది. గత కేసీఆర్ ప్రభుత్వం దూర దృష్టితో తీసుకున్న ఈ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారింది. గురుకులాల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది పేద విద్యార్థులు చదువుకు దగ్గరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు పోటీపడుతున్నారు.



# 'కరోనాపై అలర్ట్‌గా ఉండండి'

ఖలీల్‌వాడి, డిసెంబర్ 20: కరోనాపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పీహెచ్‌సీల్లో అవసరమైన సదుపాయాలను కల్పించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యసేవలందించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ షాపుల్లో సరైన ధరలకు మందులను విక్రయించేలా సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని, దుకాణాల లైసెన్సులను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో సీఈవో గోవింద్, జడ్పీటీసీలు గంగాధర్, సుమనారెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, రామ్మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు